క్లుప్తంగా

ఎస్సీ రిజర్వేషన్‌పై సమీక్ష



పాల్గొన్న సింగరేణి ఎస్సీ లైసెన్ అధికారులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్సీ ఉద్యోగులకు సంబంధించిన రిజర్వేషన్ల ప్రక్రియను సింగరేణి ఎస్సీ లైజన్ అధికారి దుర్గం రామచందర్ సమీక్షించారు. జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం జరిగిన ఈ సమీక్ష సమావేశంలో రామచంద్ర పాల్గొని ఏరియాలో ఎస్సీ ఉద్యోగులకు అందుతున్న రిజర్వేషన్ ఫలాలను సమీక్షించారు. ఎస్సీ రోస్టర్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎస్సీ ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఎస్సీ ఉద్యోగులకు కేటాయించిన ఖాళీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, డీజీఎం(పర్సనల్) పర్సనల్ అరవిందరావు, కమిటీ అధ్యక్షుడు రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఏరియా లైసెన్స్ అధికారి కిరణ్ కుమార్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ తిరుపతి డీవైపీఎం ఎస్ వీ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 24మంది గైర్హాజర్

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ సప్లమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలకు గురువారం 24మంది గైర్హాజరయ్యారు. 58మంది విద్యార్థులకు గాను 34మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 28 మందికి గాను 19మంది హాజరుకాగా 9మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్‌లో 30మందికి గాను 15మంది హాజరుకాగా 15మంది గైర్హాజరయ్యాని డీఐఈవో అంజయ్య తెలిపారు.

ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

తాండూర్: కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా సింగరేణి పరిసర ప్రాంత యువతీ యువకులకు ఉచితంగా వృత్తి నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 18నుంచి 25సంవత్సరాల వయస్సు కలిగి, కనీస విద్యార్హత పదో తరగతి ఉన్న వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఎలక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కుషాయిగూడ ఈసీఐఎల్‌లో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఏసీ, ఫ్రిడ్జ్‌లలో గ్యాస్ చార్జింగ్, ఏసీ ఇన్‌స్టాలేషన్, వాటర్ ప్యూరిఫైయర్ రిపేర్, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, డిష్ వాషర్, ఎల్ఈడీ టీవీ, ఎల్ఈడీ మానిటర్ రిపేర్, ఇన్స్టాలేషన్ కోర్సులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా 90రోజుల పాటు ఉచిత భోజనం, స్టడీ మెటీరియల్, టూల్ కిట్, జాబ్ ప్లేస్మెంట్ అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 20వ తేదీ లోపు గోలేటీ జీఎం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 99512 14116 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.


దుబ్బగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పూజలు



పూజలో పాల్గొన్న ఆర్డీవో, జీఎం

కాసిపేట: మండలంలోని దుబ్బగూడెం ఆర్ అండ్‌ఆర్ కాలనీలో గురువారం బొడ్రాయి, భూలక్ష్మి, మహాలక్ష్మి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, మందమర్రి జీఎం దేవేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. త్వరలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించనున్నందునా సంస్కృతి సంప్రదాయాల ప్రకారం విగ్రహాల ఏర్పాటు, పూజ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేకే ఓసీ పీవో మల్లయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, ఎస్టేట్ అధికారి నవనీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవర అమ్మవార్లకు పూజలు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ సతీశ్

కోటపల్లి: మండలకేంద్రంలోని గిరిజన ఆరాధ్యదైవం లక్ష్మీదేవర అమ్మవార్ల ఆలయాన్ని పునః నిర్మాణం చేసి గిరిజనులతో కలిసి గురువారం మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు బైస రాజన్న, శ్రీనివాస్, శ్రీకాంత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



మందమర్రిరూరల్: మొక్క నాటి నీళ్లు పోస్తున్న జీఎం దేవేందర్



శ్రీరాంపూర్: మొక్క నాటి నీరు పోస్తున్న జీఎం శ్రీనివాస్



కాసిపేట: గనిపై మొక్క నాటుతున్న సేఫ్టీ జీఎం రఘుకుమార్

ఘనంగా పర్యావరణ దినోత్సవం

- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అధికారుల సూచన



ఇందన్‌పల్లి రేంజ్‌లో ప్లాస్టిక్ ఏరివేస్తున్న రేంజ్ సిబ్బంది



వేమనపల్లి: సేకరించిన ప్లాస్టిక్‌తో ఎఫ్‌ఆర్‌వో అప్పలకొండ, అధికారులు

మంచిర్యాలటౌన్/వేమనపల్లి/మంచిర్యాలఅర్బన్/కాసిపేట/లక్సెట్టిపేట/మంచిర్యాలఅర్బన్/పాతమంచిర్యాల/శ్రీరాంపూర్/జన్నారం/మందమర్రిరూరల్: మొక్కలు నాటడం ద్వారానే భవిష్యత్ తరాలకు మనుగడ సాధ్యం అవుతుందని, ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని అధికారులు సూచించారు. జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఊరూరా మొక్కలు నాటారు. ఇప్పటికే ఆక్సిజన్ కొనుగోలు చేసే పరిస్థితి వచ్చిందని, పర్యావరణాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవన్నారు. గాలి, నీరు, భూమిని కలుషితం చేస్తూ మానవ మనుగడకు ముప్పు కలిగిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని, పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. మందమర్రి ఏరియాలో జీఎం దేవేందర్ హాజరై మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఎస్వో టు జీఎం విజయ్ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గనిపై గని మేనేజర్ తిరుపతి పాల్గొని గని ఆవరణలో మొక్కలు నాటారు. కాలుష్యాన్ని నియంత్రిస్తూ పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై జీఎం పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జీఎం కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన సింగరేణి సీఎండీ బలరాంనాయక్ అందించిన సందేశ పత్రాలను ఆవిష్కరించారు. శ్రీరాంపూర్ ఆర్కే 6 గనిపై మేనేజర్ కాదాసి శ్రీనివాస్ పర్యావరణ వారోత్సవాలు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో గని రక్షణ అధికారి సంతోష్ రావు, గుర్తింపు సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కిషన్ రావు, ఎన్విరాన్మెంట్ అధికారి జగదీష్ రావు, ఫిట్ సెక్రెటరీ మారేపల్లి సారయ్య, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, ఫిట్ కార్యదర్శి సంఘం సదానందం, రక్షణ అధికారి మర్రి కొమురయ్య, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, యూనియన్ నాయకులు రాంచందర్, కారుకూరి నగేష్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రీజియన్ కార్యాలయం ఆవరణలో అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఐఏ ప్రాజెక్టు డైరెక్టర్ కేఎన్ అజయ్ మణికుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. ప్లాస్టిక్ వినియోగం మానాలని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. వాల్టా రక్షణ చట్టం అథారిటీ రాష్ట్ర సభ్యులు గుండేటి యోగేశ్వర్, ఎంసీసీ అధ్యక్షుడు ప్రకాశ్‌రావు, డీజీఎం అనిల్‌కుమార్ పాల్గొన్నారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్ర రెడ్డి, డాక్టర్ లింగారెడ్డి, సీహెచ్‌వో లక్ష్మణస్వామి, సురేందర్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ రాకేశ్ పాల్గొన్నారు. నస్పూర్ రేడియంట్ హైస్కూల్లో ట్రాష్ టూ ట్రెజర్ అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పనికిరాని వస్తువులతో వినూత్న కళాఖండాలుగా తయారు చేసి ప్రదర్శించారు. డీఈవో యాదయ్యను గురువారం కలిసి పాఠశాల సిబ్బంది, విద్యార్థుల చేతిలో రూపుదిద్దుకున్న వస్తువులపై వివరించగా అభినందించారు. కాసిపేట గనిపై బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్ మొక్కలు నాటారు. గనుల్లో ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకొని ప్రమాదాలను నివారించుకోవాలని సూచించారు. కేకే గ్రూప్ ఏజెంట్ రాందాస్, ఏరియా రక్షణాధికారి రవికుమార్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, కాసిపేట గని మేనేజర్ భూశంకరయ్య, పాల్గొన్నారు. లక్సెట్టిపేట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో ఫారెస్టు ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్‌రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి కె.సాయికిరణ్ మొక్కలు నాటారు. ఏజీపీ సత్యం, బార్ సభ్యులు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ఫారెస్ట్ రేంజి అధికారి సుభాష్ పాల్గొన్నారు. జన్నారం రేంజ్ పరిధిలో అటవీ అధికారుల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమం నిర్వహించారు. రేంజ్ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ ఏరివేశారు. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్, సెక్షన్ అధికారులు హన్మంతరావు, రవి పాల్గొన్నారు. వేమనపల్లిలో నీల్వాయి అటవీ రేంజ్ పరిధిలోని ఎఫ్‌ఆర్‌వో అప్పలకొండ ఆధ్వర్యంలో నీల్వాయి, ఇతర గ్రామాల్లో అటవీ సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఆర్‌వో ప్రమోద్‌కుమార్, అటవీ సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.



లక్సెట్టిపేట: మొక్కలు నాటుతున్న న్యాయమూర్తులు



ఎన్‌హెచ్‌ఏఐ కార్యాలయంలో మొక్క నాటి నీరు పోస్తున్న అధికారులు



జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటుతున్న వైద్యులు

'భూ భారతి'తో భూ సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ కుమార్‌దీపక్




లబ్ధిదారులకు ఇందిరమ్మ హక్కు పట్టా ఇస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

బెల్లంపల్లిరూరల్: భూ భారతి రెవెన్యూ సదస్సులతో గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి, పెర్కపల్లి గ్రామాల్లో జరుగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సదస్సు జరుగుతున్న తీరును పరిశీలించారు. రైతుల సమస్యలను సత్వరంగా పరిష్కరించేలా అధికారులు, సిబ్బంది చొరవ తీసుకోవాలని సూచించారు. సమస్యలు విన్నవించేందుకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. సదస్సులో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని పరిష్కరించాలని సూచించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెర్కపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారుల హక్కు పట్టా పత్రాలను అందజేశారు. లబ్ధిదారుడి ఇంటి నిర్మాణానికి ముగ్గు పోశారు. ప్రతి ఒక్కరి అభ్యున్నతి కోసం ప్రభుత్వం పాటు పడుతోందన్నారు. పేదవారి సొంతింటి కలను నెరవేర్చడానికి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, ఈ పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందిస్తుందని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. లబ్ధిదారులు గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ కృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగతి సత్యనారాయణ, ఎంపీడీవో మహేందర్, డిప్యూటీ తహసీల్దార్ హమీద్, బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో తప్పులు జరిగితే ఉపేక్షించం

- ప్రజావేదికలో డీఆర్‌డీవో కిషన్



మాట్లాడుతున్న డీఆర్‌డీవో కిషన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహాత్మగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంఎన్ఆర్ ఈజీఎస్)లో అమలులో భాగంగా జరిగే పనుల్లో తప్పులు జరిగితే ఉపేక్షించేది లేదని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి(డీఆర్‌డీఓ) కిషన్ స్పష్టంగా తెలియజేశారు. హాజీపూర్ మండల పరిషత్(ఎంపీపీ) కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం 4వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. 15రోజులుగా మండలంలోని 17గ్రామ పంచాయతీల్లో 2024 ఏప్రిల్ 1నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు ఈజీఎస్ పరిధిలో చేపట్టిన 441పనులకు సంబంధించి రూ.3.78కోట్ల విలువ గల అభివృద్ధి పనులను, రికార్డులను సామాజిక తనిఖీ బృందాలు పరిశీలించి ప్రజావేదికలో చర్చించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఈజీఎస్ పనుల నిర్వహణలో తప్పులు, నిధుల దుర్వినియోగం జరగడాన్ని గుర్తించారు. పక్కదోవ పట్టిన నిధుల రికవరీకి ఆదేశించారు. ప్రజావేదికలో జరిగిన చర్చల అనంతరం డీఆర్‌డీఓ కిషన్ మాట్లాడుతూ.. నాల్గో విడత సామాజిక తనిఖీల్లో భాగంగా తలెత్తిన తప్పులు భవిష్యత్తులో జరగకుండా సరిదిద్దుకొని, పునరావృతం కాకుండా చూసుకోవాలని, అంతా సమన్వయంతో వ్యవహరించి పనులు పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. ప్రజావేదికలో ఎంపీడీవోలు మధుసూధన్, ప్రసాద్, విజిలెన్స్ మేనేజర్ కిరణ్, ఎస్‌ఆర్‌పీ సాయిలు, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, ఈసీ శ్రీనివాసరెడ్డి, టీఏలు స్రవంతి, శంకర్, వేణు, అన్నమల్లై, పంచాయతీ కార్యదర్శులు, సోషల్ ఆడిట్ డీఆర్‌పీలు, క్షేత్ర సహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

దండేపల్లి: మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు విత్తన దుకాణాల్లో వ్యవసాయ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం సంయుక్త తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో గొర్ల అంజిత్‌కుమార్, ఎస్సై తహసీనొద్దీన్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాల బెడద ఉన్నందునా, రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. విత్తన దుకాణదారులు నాణ్యమైన, బ్రాండెడ్ కంపెనీల విత్తనాలు మాత్రమే విక్రయించాలని ఆదేశాలు జారీ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మిన, వాటిని సరఫరా చేసిన అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినా రైతులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.

సీసీ కెమెరాలతో ప్రజలకు భద్రత



మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: సీసీ కెమెరాల ఏర్పాటుతో ప్రజలకు భద్రత ఉంటుందని బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ అన్నారు. టూటౌన్ పరిధి కాల్‌టెక్స్ ఏరియాలో గురువారం కమ్యూనిటీ సీసీ కెమెరాలను స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత యాంత్రిక యుగంలో సీసీ కెమెరాలకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడిందన్నారు. నేర నిరూపణలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని వివరించారు. అంతగా ఉపయోగాలున్న సీసీ కెమెరాలను జన నివాసాల్లో, వీధుల్లో, కూడళ్ల వద్ద ఏర్పాటు చేయడానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన స్థానిక నాయకులు, కాలనీ వాసులను శాలువాతో ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై మహేందర్, పోలీసు సిబ్బంది, కాల్‌టెక్స్ ఏరియా ప్రజలు పాల్గొన్నారు.

ఈ-పాస్ మిషన్లు అందజేత



డీలర్స్‌కు మిషన్స్ అందజేస్తున్న డీఏవో కల్పన

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల రైతువేదికలో గురువారం బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాల ఫెర్టిలైజర్స్ డీలర్స్‌కు ఎల్-1 ఈ-పాస్ మిషన్లను జిల్లా వ్యవసాయాధికారి జి.కల్పన అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డీలర్లు ఎరువుల అమ్మకాలను విధిగా మిషన్ల ద్వారానే చేపట్టి వివరాలను మిషన్లలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. స్టాక్ వివరాలు నమోదు చేయని, మిషన్ల ద్వారా అమ్మకాలు జరపని వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని, నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏడీఏ రాజానరేందర్, జిల్లా సాంకేతిక వ్యవసాయ అధికారి శ్రీనివాస్, బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాల వ్యవసాయ అధికారులు ప్రేమ్‌కుమార్, సుష్మ, ప్రభాకర్, ఏఈవో తిరుపతి, డీలర్స్ పాల్గొన్నారు.

ఎవరి 'దారి' వారిదే..!



మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు రైలు పట్టాలు దాటుతుండటంతో ప్రమాదం పొంచి ఉంది. రైళ్ల కోసం ఒక ప్లాట్ ఫాం నుంచి మరో ప్లాట్ ఫాంలకు వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు ఉన్నప్పటికీ ఉపయోగించకుండా, తొందరగా వెళ్లాలనే ఉద్దేశంతో ఎవరి 'దారి'న వారు పట్టాలు దాటుతున్నారు. పట్టాలు దాటుతున్న సమయంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలున్నాయి. పట్టాలు దాటుతుండగా అనుకోకుండా రైలు వస్తే ఎలా అనే దానిపై పలువురు ప్రయాణికులు చర్చించుకోవటం కనిపించింది. గురువారం మధ్యాహ్నం ఇంటర్‌సిటీ రైలు కోసం ప్రజలు తమ ప్రాణాలను లెక్క చెయకుండా రైలు పట్టాలు దాటుతున్న దృశ్యాలను 'సాక్షి' క్లిక్ మనిపించింది. – మంచిర్యాలఅర్బన్

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నంనూర్ పునరావాస కాలనీలోని నూతన ఆలయంలో కొనసాగుతున్న దేవతామూర్తుల, ధ్వజ శిఖర ప్రతిష్ఠాపనా మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. చివరిరోజు గురువారం ఉదయం విగ్రహాలను వేదమంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా ప్రతిష్ఠించగా, ఆలయం ఎదురుగా ధ్వజశిఖరం ప్రతిష్ఠించారు. వేదపండితులు దుద్దిళ్లమనోహర అవధాని ప్రత్యక్ష పర్యవేక్షణలో వేద పండితులు దుద్దిళ్ల ధీరజ్ అవధాని, వారి శిష్య బృందం ఆధ్వర్యంలో మహోత్సవాలు కనుల పండవగా జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శివాజీ, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్ పాండేలతో పాటు ఆలయ నిర్మాణ ప్రధాన దాత ఆన్‌కార్ పద్మశ్రీ–సత్యనారాయణ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెంచిన ధరలు తగ్గించాలి

జన్నారం: రైతులకు అందించే పచ్చిరొట్ట ధరలు తగ్గించాలని గురువారం మండల కేంద్రంలో ఏవో సంగీతకు మాజీ సర్పంచులు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలోమాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్ , నాయకులు ఉన్నారు.